


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

| శుక్రవారం 24 జులై 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :52 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## శాసనసభ పునరుద్ధరణ పనులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (సందేశం టైమ్స్): చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. శాసనసభ ప్రాంగణమంతా తిరిగి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించిన సీఎం, సంబంధిత అధికారుల నుంచి పనుల వివరాలను తెలుసుకుని నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. శాసనసభ భవనం చారిత్రక వైభవాన్ని కాపాడుతూ ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పేపర్ లీక్ కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు.. ప్రధాని మోదీ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 24 (సందేశం టైమ్స్): దేశ యువత ప్రయోజనాలు, వారి భవిష్యత్తు ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పేపర్ లీక్ కేసుల్లో దోషులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు అవసరమైన అన్ని చర్యలు తక్షణమే చేపట్టాలని సంబంధిత శాఖలు, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న వరుస నిర్ణయాల్లో ఇది మరో కీలక అడుగని పేర్కొన్నారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ప్రధాని మోదీ హెచ్చరించారు.

## విద్యార్థుల యూనిఫాంలపై వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్.. ఆగస్టు 15 నాటికి పంపిణీ పూర్తి చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూలై 24 (సందేశం టైమ్స్): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన అనంతరం వాటి నాణ్యత, సైజు, రంగు తదితర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల అభిప్రాయాల ఆధారంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి యూనిఫాంల పంపిణీ విధానం, రంగులు తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్న సీఎం, ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి యూనిఫాం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. మహిళా సంఘాల ద్వారా కుట్టు పనులను వేగవంతం చేసేందుకు కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో యూనిఫాంల పంపిణీలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని, పేద విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి జూన్ 2 నాటికే విద్యార్థులకు యూనిఫాంలు అందేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## బీఎల్ఏ నియామక నిబంధనలను సవరించిన ఎన్నికల కమిషన్




న్యూఢిల్లీ, జూలై 24 (సందేశం టైమ్స్): ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సౌలభ్యాన్ని కల్పించే దిశగా భారత ఎన్నికల కమిషన్ (ECI) బూత్ లెవల్ ఏజెంట్ (BLA) నియామక నిబంధనలను సవరించింది. తాజా మార్గదర్శకాల ప్రకారం, ఓటరు జాబితాలోని అదే పార్ట్‌కు చెందిన బీఎల్ఏ అందుబాటులో లేని పరిస్థితుల్లో, అదే అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన ఏ నమోదిత ఓటరినైనా బూత్ లెవల్ ఏజెంట్‌గా నియమించుకునే వెసులుబాటును కల్పించింది. ఈ నిర్ణయం ద్వారా ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలకు మరింత సౌలభ్యం కలగడంతో పాటు ఓటరు జాబితాల నిర్వహణ, ధృవీకరణ ప్రక్రియ మరింత సమర్థవంతంగా సాగుతుందని ఎన్నికల కమిషన్ పేర్కొంది.

## కేఎన్ఆర్‌యూహెచ్‌ఎస్ జూలై 24 పరీక్షలు వాయిదా

హైదరాబాద్, జూలై 24 (సందేశం టైమ్స్): అనివార్య కారణాల దృష్ట్యా కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (KNRUHS) జూలై 24, 2026న నిర్వహించాల్సిన పలు పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. వాయిదా పడిన పరీక్షల్లో బీపీటీ ద్వితీయ సంవత్సరం, ఫైనల్ ఇయర్ సప్లిమెంటరీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ, బీఏఎంఎస్ ద్వితీయ సంవత్సరం (పాత నిబంధనలు), బీయూఎంఎస్ ద్వితీయ సంవత్సరం (పాత నిబంధనలు), బీఎస్సీ నర్సింగ్ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ, మూడో బీఎన్‌వైఎస్ పార్ట్–1 సప్లిమెంటరీ, రెండో బీఎన్‌వైఎస్ పార్ట్–2 సప్లిమెంటరీ, మూడో బీఎన్‌వైఎస్ పార్ట్–2, బీడీఎస్ ఫైనల్ ఇయర్ సప్లిమెంటరీ, బీఎస్సీ (అలైడ్ హెల్త్ సైన్సెస్) మూడో సంవత్సరం ఆడియాలజీ అండ్ స్పీచ్ థెరపీ టెక్నాలజీ, ఆప్టోమెట్రీ పరీక్షలు ఉన్నాయి. ఈ పరీక్షలకు సంబంధించిన కొత్త తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని కేఎన్ఆర్‌యూహెచ్‌ఎస్ రిజిస్ట్రార్ వెల్లడించారు.

## టీపీసీసీ ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ జన్మదిన శుభాకాంక్షలు




హైదరాబాద్, జూలై 24 (సందేశం టైమ్స్): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ జన్మదిన సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ సిద్ధాంతాల పట్ల ఆమె అచంచల నిబద్ధత, విలువలతో కూడిన నాయకత్వం, పార్టీ సంస్థను మరింత బలోపేతం చేయాలనే అంకితభావం దేశవ్యాప్తంగా కోట్లాది కాంగ్రెస్ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆమె సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండి ప్రజాసేవ, దేశసేవలో మరెన్నో సంవత్సరాలు విశేష సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏపీ పోలీస్ రిట్రీట్–2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరు



విజయవాడ, జూలై 24 (సందేశం టైమ్స్): ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ నిర్వహించిన ఏపీ పోలీస్ రిట్రీట్–2026: ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. రాష్ట్రంలో ఆధునిక సాంకేతికత ఆధారిత పోలీసింగ్, ప్రజా భద్రత, నేర నియంత్రణ, భవిష్యత్ పోలీసింగ్ విధానాలపై నిర్వహించిన ఈ సదస్సులో అధికారులు, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం.

## క్యూర్ పరిధిలో 50 ఏళ్ల అవసరాలకు తగిన తాగునీటి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (సందేశం టైమ్స్): క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి రానున్న 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా, సీవరేజీ బోర్డు పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగునీటి సరఫరాలో ఏకరూపత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న అన్ని నీటి వనరులను పరస్పరం అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఒక వనరు నుంచి నీటి సరఫరా నిలిచిపోయినా మరో వనరు ద్వారా ఆయా ప్రాంతాలకు నీరు అందే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేయాలని చెప్పారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే నీరు సరఫరా అవుతోందని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేస్తూ, రోజు విడిచి రోజు తాగునీరు అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగునీటి సరఫరా ప్రాజెక్టులను ఏడాదిన్నరలోపు పూర్తి చేయాలని, ఎస్టీపీల నిర్మాణ పనులను కూడా నిర్ణీత గడువులో ముగించాలని, న్యాయపరమైన అడ్డంకులు ఉంటే వేగంగా పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణ పనుల పురోగతిపై ప్రతి నెల తనకు నివేదిక సమర్పించాలని, పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో పరిశ్రమలు, నిర్మాణ రంగంలో గ్రే వాటర్ వినియోగాన్ని తప్పనిసరి చేసే విధంగా నిబంధనలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రాజమండ్రి చేరుకున్న మంత్రి నారా లోకేష్.. నేడు మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో పాల్గొననున్న మంత్రి

రాజమండ్రి, జూలై 24 (సందేశం టైమ్స్): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకోగా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి స్వీకరించిన మంత్రి అనంతరం రోడ్డు మార్గంలో పోలవరం జిల్లా రంపచోడవరానికి బయలుదేరారు. నేడు రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో మంత్రి లోకేష్ పాల్గొననున్నారు.



## సూర్యాపేటలో ఎన్‌హెచ్-65 విస్తరణ, ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

సూర్యాపేట, జూలై 24 (సందేశం టైమ్స్): సూర్యాపేట జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి–65 (ఎన్‌హెచ్-65) విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ గురువారం సంయుక్తంగా పరిశీలించారు. జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ నరసింహ సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేసి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యార్థి పర్యావరణ కాంగ్రెస్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి: సంగారెడ్డి డీఈవో రోహిణి

సంగారెడ్డి, జూలై 24 (సందేశం టైమ్స్): విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ, విద్యా మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంగ్రెస్ (NSPC) ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి ఆర్. రోహిణి పిలుపునిచ్చారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాఠశాలలు, కళాశాలలు, పరిశోధన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. జూలై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముందుగా ecomitram యాప్‌ను డౌన్‌లోడ్ చేసి పాఠశాలను నమోదు చేసుకుంటే క్యూ ఆర్ కోడ్ రూపొందుతుందని, దాని ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొని సర్టిఫికెట్ పొందవచ్చని వివరించారు. తుది ఫలితాలను సెప్టెంబర్ 20న ప్రకటిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులతో పాటు ఎక్కువ మంది విద్యార్థులను పాల్గొనేలా ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో విజేతలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు, జాతీయ స్థాయిలో సత్కారాలు ఉంటాయని వెల్లడించారు. సహజ వనరుల సంరక్షణ, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, శిలాజ ఇంధనాలు, అడవుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ప్రతి విద్యాసంస్థలో ఎన్‌ఎస్‌పీసీ నోడల్ అధికారిని నియమించాలని, ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు తమ 'బ్యాగ్‌లెస్ డే'లో ఒక రోజును ఎన్‌ఎస్‌పీసీ డేగా నిర్వహించాలని, జూనియర్, డిగ్రీ కళాశాలలు కూడా ఆగస్టు 15లోపు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త మాధవ రెడ్డి (9440069750)ను సంప్రదించాలని డీఈవో తెలిపారు.



## ఇమాంపేట గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట, జూలై 24 (సందేశం టైమ్స్): సూర్యాపేట పరిధిలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కిచెన్, డైనింగ్ హాల్, వెజిటబుల్ స్టోర్, బియ్యం, నిత్యావసర సరుకుల నిల్వ గదులను పరిశీలించి పరిశుభ్రత, నిల్వ విధానంపై పలు సూచనలు చేశారు. కూరగాయలు, ఇతర సరుకులను నాణ్యత దెబ్బతినకుండా భద్రపరచాలని, గుడ్లను అవసరానికి అనుగుణంగా మాత్రమే నిల్వ ఉంచాలని, వంటశాల, భోజనశాల ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పదో తరగతి తరగతి గదిని సందర్శించి విద్యార్థులకు కొద్దిసేపు హిందీ పాఠం బోధిస్తూ చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కంప్యూటర్ ల్యాబ్, ప్లేగ్రౌండ్‌ను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యతో పాటు క్రీడలు, కంప్యూటర్ పరిజ్ఞానంలోనూ రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించగా, ప్లేగ్రౌండ్ విస్తరణపై విద్యార్థుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ అనంతరం వారితో కలిసి భోజనం చేసి భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మెస్ కమిటీ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, ప్రతిరోజు స్టాక్ వివరాలు నమోదు చేయాలని, ప్రభుత్వం పెంచిన డైట్, కాస్మొటిక్ చార్జీలకు అనుగుణంగా నిర్దేశిత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. గురుకులాల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన వాతావరణం కల్పించాలని, టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్లు, డోర్లకు సంబంధించిన చిన్నపాటి మరమ్మతులను 15 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ టవర్స్‌పై బీఆర్ఎస్ దుష్ప్రచారం మానుకోవాలి.. పేదలకు రూ.40–60 లక్షల విలువైన ఇల్లు కేవలం రూ.6 లక్షలకే: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూలై 24 (సందేశం టైమ్స్): హైదరాబాద్ నగర నడిబొడ్డున పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పాన్ని బీఆర్ఎస్ తట్టుకోలేక దుష్ప్రచారం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తుల ప్రక్రియపై అధికారులతో సమీక్ష అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ పథకానికి మీ సేవ కేంద్రాలు, మీ సేవ వాట్సాప్ నంబర్ (8096958096), అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేదని, నగరానికి దూరంగా అరకొర వసతులతో ఇళ్లు నిర్మించి పేదలను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రభుత్వ భూములను ప్రజా సంక్షేమానికి వినియోగిస్తూ నగరంలోనే పేదలకు శాశ్వత గృహాలు కల్పించేందుకు ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్‌గా విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తోందని, లబ్ధిదారుడి వాటా కేవలం రూ.6 లక్షలేనని, మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉన్న ఫ్లాట్లను పేదలకు అందిస్తున్నామని తెలిపారు. తొలి విడతలో క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, అందులో 30 శాతం మహిళలకు కేటాయిస్తున్నామని వివరించారు. పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలు మానుకోవాలని, బీఆర్ఎస్ విషప్రచారాన్ని ప్రజలు నమ్మబోరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఉచిత ఓరియెంటేషన్ కార్యక్రమం.. జూలై 25 వరకు దరఖాస్తులకు అవకాశం

హైదరాబాద్, జూలై 24 (సందేశం టైమ్స్): డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (డాక్టర్ ఎం.సి.ఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ) స్వర్ణోత్సవాల సందర్భంగా సివిల్ సర్వీసెస్, గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం జూలై 27 నుంచి 31 వరకు రెండో విడత ఉచిత ఒక వారపు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 2 నుంచి నిర్వహించిన తొలి విడత కార్యక్రమానికి మంచి స్పందన రావడంతో రెండో బ్యాచ్‌ను నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ప్రతిరోజూ మూడు గంటల పాటు జరిగే ఈ శిక్షణలో పరీక్షా వ్యూహం, వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అంశాలపై అనుభవజ్ఞులైన అధ్యాపకులు శిక్షణ అందిస్తారు. ఈ కార్యక్రమం పూర్తిగా ఉచితంగా నిర్వహించబడుతున్నప్పటికీ వసతి, భోజన సౌకర్యాలు ఉండవని స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా లేదా సీవీని ctsmcrhrdti24@gmail.com ఈ-మెయిల్‌కు పంపించాలని, జూలై 25 దరఖాస్తులకు చివరి తేదీగా నిర్ణయించినట్లు సంస్థ వెల్లడించింది. నాణ్యమైన మార్గదర్శకత్వం ద్వారా యువతను సమర్థవంతమైన ప్రజాసేవకులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని డాక్టర్ ఎం.సి.ఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది.

## సూర్యాపేటలో రూ.69 కోట్ల ధాన్యం కొరత వెలుగులోకి.. రెండు రైస్ మిల్లులపై కేసులు



సూర్యాపేట, జూలై 24 (సందేశం టైమ్స్): సూర్యాపేట మండలం బాలెంలోని వజ్ర రైస్ కార్పొరేషన్ మరియు వజ్ర వికాస్ రైస్ మార్ట్ రైస్ మిల్లుల్లో భారీ స్థాయిలో ధాన్యం కొరత బయటపడింది. విశ్వసనీయ సమాచారం మేరకు జూలై 20న నల్గొండ జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సూర్యాపేట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల సంయుక్త బృందం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. తనిఖీల సమయంలో వజ్ర వికాస్ రైస్ మార్ట్ నుంచి ముదిగొండలోని సత్యసాయి రైస్ కార్పొరేషన్ పేరుతో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు సరఫరా చేయాల్సిన బియ్యాన్ని లారీలలో లోడ్ చేస్తుండగా అధికారులు గుర్తించి నిలిపివేసి, లారీలు, బియ్యం నిల్వలు, సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇరు రైస్ మిల్లుల్లో నిర్వహించిన భౌతిక ధృవీకరణలో రికార్డుల ప్రకారం ఉండాల్సిన ధాన్యంతో పోలిస్తే వజ్ర రైస్ కార్పొరేషన్‌లో 11,073.054 మెట్రిక్ టన్నులు, వజ్ర వికాస్ రైస్ మార్ట్‌లో 18,114.834 మెట్రిక్ టన్నులు, మొత్తం 29,187.888 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ధాన్యం విలువ సుమారు రూ.69 కోట్లు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి సమక్షంలో పంచనామా నిర్వహించి మిల్లుల్లో ఉన్న ధాన్యం, బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకోగా, సంబంధిత మిల్లులపై రికవరీ చర్యలతో పాటు చట్టపరమైన నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. స్వాధీనం చేసిన ధాన్యాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర అనుమతించిన రైస్ మిల్లులకు తరలించాలని తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ధాన్యం, కస్టమ్ మిల్లింగ్, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది.

## భూముల రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: కలెక్టర్ ప్రతిమాసింగ్




మెదక్, జూలై 24 (సందేశం టైమ్స్): భూముల రీ సర్వేతో ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. గురువారం మెదక్ మండలం కోమటూరు గ్రామంలో నిర్వహించిన భూభారతి భూముల రీ సర్వే గ్రామసభలో కలెక్టర్ పాల్గొని రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, ఏడి ల్యాండ్ సర్వే కిషన్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న నిజమైన రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని, అక్రమంగా పట్టాలు పొంది ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల ఆధారంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామంలోని భూములకు మొదట హద్దులు నిర్ధారించి భూములపై స్పష్టత తీసుకురానున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ భూముల గుర్తింపు కూడా సులభమవుతుందని పేర్కొన్నారు. పట్టా ఉన్నా మోకాపై లేని భూములు, మోకాపై ఉన్నా పట్టాలు లేని భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేయర్లు, రైతులు, ప్రజల సహకారంతో భూ సమస్యల పరిష్కార ప్రక్రియ వేగవంతం అవుతుందని కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు.



## వసతి గృహాల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి: కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్, జూలై 24 (సందేశం టైమ్స్): వసతి గృహాల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ హాస్టల్ నిర్వాహకులను ఆదేశించారు. చిన్న శంకరంపేట మండలంలో గురువారం నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ షెడ్యూల్ కులాల (ఎస్సీ) బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి ఆహార పదార్థాల నిల్వ విధానం, పరిశుభ్రత పరిస్థితులను తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ ఆవరణ, డ్రైనేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, ఇతర వసతులను పరిశీలించి విద్యార్థుల సంఖ్య, సిబ్బంది వివరాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్ గదులు, మరుగుదొడ్ల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆవరణలో మొక్కలను క్రమపద్ధతిలో పెంచాలని, ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ నిధులను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వసతి గృహంలో సరిపడా వెలుతురు ఉండేలా అదనపు ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే బయటి వ్యక్తులను హాస్టల్ ప్రాంగణంలోకి అనుమతించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ తులసీరామ్, ఎంపీడీవో దామోదర్, సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలి: ఎల్దుర్తి ఎస్ఐకి ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచన

మెదక్, జూలై 24 (సందేశం టైమ్స్): ఎల్దుర్తి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కర్ణాకర్ రెడ్డి మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నూతన ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపి, ఎల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని ఎస్పీ పేర్కొన్నారు. కాగా, ఇంతకుముందు ఎల్దుర్తి ఎస్ఐగా విధులు నిర్వహించిన రాజు జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

## మెదక్ జిల్లాలో 142 సెల్‌ఫోన్ల రికవరీ.. బాధితులకు అందజేసిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు







మెదక్, జూలై 24 (సందేశం టైమ్స్): పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్ల రికవరీలో మెదక్ జిల్లా పోలీసులు గణనీయమైన పురోగతి సాధించారు. కేవలం 22 రోజుల్లో రికవరీ చేసిన 142 సెల్‌ఫోన్లను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ బాధితులకు అందజేశారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల మొత్తం విలువ రూ.21.84 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. తమ ఫోన్లు తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు మెదక్ జిల్లా పోలీసులు 4,038 సెల్‌ఫోన్లను రికవరీ చేసి, కమిషనరేట్లను మినహాయిస్తే రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచారని ఎస్పీ వెల్లడించారు. మొబైల్ ఫోన్ల రికవరీ కోసం ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఒక కానిస్టేబుల్‌ను నియమించి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ప్రజలు సీఈఐఆర్ (CEIR) పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఫోన్ ఐఎంఈఐ నంబర్ అందుబాటులో ఉంటే రికవరీ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, రైతు బజార్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అపరిచిత వ్యక్తులకు మొబైల్ ఫోన్లు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. పాత మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసే షాపులు, రిపేరింగ్ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా యజమాని వివరాలు, ధ్రువపత్రాలు, ఐఎంఈఐ నంబర్ పరిశీలించాలని సూచించారు. చోరీకి గురైన ఫోన్ల కొనుగోలు, విక్రయాల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు జార్జ్, రాజశేఖర్ రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది విజయ్, మహేందర్, వెంకట్ గౌడ్, సీఈఐఆర్ పోర్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



## మెదక్ MCHలో సమస్యలు పరిష్కరించాలి.. వారం రోజుల్లో చర్యలు లేకుంటే ఉద్యమం: సీపీఎం హెచ్చరిక

మెదక్, జూలై 24 (సందేశం టైమ్స్): మెదక్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (MCH)లో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ మణికంఠకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యం. అడివయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేషెంట్లు, వారి సహాయకులకు అవసరమైన కనీస సౌకర్యాలు అందడం లేదని ఆరోపించారు. MCHలో రోగుల సహాయకుల కోసం ఏర్పాటు చేసిన షెడ్ రేకులు దెబ్బతిన్నా మరమ్మతులు చేయడం లేదని, మహిళలు స్నానాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని, పిచ్చి మొక్కలు పెరిగి రాత్రి వేళల్లో పాములు, తేళ్ల భయం ఉందని పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్వహణ సరిగా లేదని, రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకునేందుకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. పార్కింగ్ సౌకర్యం లేక వాహనాలను రోడ్డుపై నిలిపివేయాల్సి వస్తోందని, ఆసుపత్రికి వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు లేక రాత్రివేళ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు, తగిన సిబ్బంది కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు గతంలో వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని ఆరోపిస్తూ, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే MCHను సందర్శించాలని కోరారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా MCH ఆర్ఎంఓ డాక్టర్ మణికంఠ మాట్లాడుతూ ఆసుపత్రిలోని సమస్యలను పరిశీలించి వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కె. మల్లేశం, బాలమణి, కడారి నాగరాజు, సంతోష్, అజయ్, షౌకత్, దుర్గ, వెంకటేష్, రాకేష్, భరత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## నర్సాపూర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

మెదక్, జూలై 24 (సందేశం టైమ్స్): నర్సాపూర్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ఓటరు నమోదు ప్రక్రియను మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగించాలని సంబంధిత బీఎల్ఓలు, బీఎల్ఏలకు సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఖచ్చితమైన ఓటరు జాబితానే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30వ తేదీలోపు ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, కౌన్సిలర్లు ఆంజనేయులు గౌడ్, సుధీర్ గౌడ్, దావూద్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు అజ్మాత్, రషీద్, లలిత నర్సింగ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత నిరసనకారులపై పోలీసుల చర్యలను ఖండించిన సీపీఎం నాయకులు కోటగిరి వెంకట్ నారాయణ




సూర్యాపేట, జూలై 24: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడం, బాష్పవాయువు ప్రయోగించడాన్ని సీపీఎం జిల్లా నాయకులు కోటగిరి వెంకట్ నారాయణ తీవ్రంగా ఖండించారు. కోదాడ పట్టణంలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, పేపర్ లీక్‌లకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రదు చేయాలని, కేంద విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా వారిపై పోలీసుల చర్యలు ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా అభివర్ణించారు. పేపర్ లీక్‌లతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటున్నా కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. అరెస్టు చేసిన నిరసనకారులను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం కోదాడ పట్టణ కార్యదర్శి ఎం. ముత్యాలు, డీవైఎఫ్ఐ నాయకులు జె. సాయికుమార్, జంగపల్లి శ్రీనివాస్, గంట నాగరాజు, యూనియన్ నాయకులు శరభంద రెడ్డి, సత్తిరెడ్డి, తిరపయ్య, శ్రీను, వెంకన్న, సైదులు,



# ఓటరు జాబితా సవరణలో పారదర్శకత పాటించాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, జూలై 24: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లు, బీఎల్ఓలు, సూపర్వైజర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 86 శాతం ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మరణించిన ఓటర్లు, డబుల్ నమోదైన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, గైర్హాజరైన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి ధృవీకరణ చేపట్టాలని సూచించారు. 2002 ఓటరు జాబితా నుంచి ఇప్పటి వరకు గుర్తింపు పొందని ఓటర్ల వివరాలను సేకరించి గుర్తింపు ప్రక్రియలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాల్లో ఉన్న లోపాలను పరిశీలించి సరిచేయాలని సూచించారు. ఓటర్ల పేర్ల తొలగింపు ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సమక్షంలో ధృవీకరణ పూర్తి చేసి వారి సంతకాలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. సమావేశంలో నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యతోనే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట: న్యాయ విజ్ఞాన సదస్సులో వక్తలు





మెదక్, జూలై 24: విద్య ప్రతి విద్యార్థి భవిష్యత్‌కు బంగారు బాట వేస్తుందని, చిన్నారుల్లో విద్యపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ న్యాయమూర్తి ఎం. హేమలత పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నర్సాపూర్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల విద్యాధికారి డి. తారా సింగ్, సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, లీగల్ సర్వీస్ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్, న్యాయవాది మధు శ్రీ శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్య నాయక్ తదితరులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్య భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, విద్య ద్వారానే వ్యక్తిత్వ వికాసం, ఉన్నత భవిష్యత్ సాధ్యమవుతుందని వారు వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా అభ్యసించి విజ్ఞానవంతులుగా ఎదగాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యా హక్కు, బాలల హక్కులు, రాజ్యాంగం కల్పించిన అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు బాలకృష్ణ, రమేష్ రాజ్, శ్రీనివాస్, లీగల్ సర్వీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా రైతులు పంట మార్పిడి చేపట్టాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, జూలై 24: ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగంతో అధిక లాభాలు వచ్చే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయని, జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై ఇప్పటికే అవగాహన కల్పించామని చెప్పారు. వరి పంటకు అధిక నీరు అవసరం కాగా, పత్తి, కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, చిరుధాన్యాల వంటి పంటలకు తక్కువ నీరు అవసరమని వివరించారు. నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ స్టేజ్-2, మూసీ ప్రాజెక్టులతో పాటు చెరువుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉందని, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని కోరారు. జిల్లాలో వానాకాలం సాగు వివరాలను వెల్లడిస్తూ పత్తి, వరి సాగు సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే తక్కువగా ఉందని తెలిపారు. తక్కువ కాలంలో పండే చిరుధాన్యాల విత్తనాలు, కూరగాయల విత్తనాలు, అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రకృతి పరిస్థితులను అర్థం చేసుకుని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంట మార్పిడి చేపట్టి ఆర్థిక నష్టాలను తగ్గించుకోవాలని రైతులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.




# పాల్వట్లలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వజనాల విశ్వాస్‌కు ఘన సన్మానం

మెదక్, జూలై 24: వట్‌పల్లి మండలంలోని పాల్వట్ల గ్రామంలో ఎస్ఐఆర్ (SIR) కార్యక్రమం సందర్భంగా నూతనంగా ఎన్నికైన వట్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వజనాల విశ్వాస్‌కు గ్రామ సర్పంచ్ రాణి మైపాల్ రెడ్డి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మరవెల్లి మాజీ సర్పంచ్ శివశరణ్, ఆత్మ కమిటీ చైర్మన్ కాచుర్ రావు, కార్తీక్ గౌడ్, కళ్యాణ్, అరవింద్, ఆత్మ కమిటీ డైరెక్టర్ పెద్దగోళ్ల సాయిబాబా, రాజు పటేల్, దిగంబార్, ఖాజాపాషా, వీరప్ప, జుట్టు నర్సింలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వజనాల విశ్వాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.




# ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి: డా. ఏ. చంద్రశేఖర్

జహీరాబాద్, జూలై 24: జహీరాబాద్ పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లతో (BLAలు) ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ వార్ రూమ్ కో-ఆర్డినేటర్ జూలూరి ధనలక్ష్మి, జహీరాబాద్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మొహమ్మద్ గౌస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడటం కాంగ్రెస్ పార్టీ BLAలు, కార్యకర్తల బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు కీలకమని, SIR ప్రక్రియలో నిర్లక్ష్యం లేకుండా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి అర్హులైన వారికి దరఖాస్తుల ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత అని పేర్కొంటూ, పార్టీ నాయకులు, BLAలు సమన్వయంతో పనిచేసి జహీరాబాద్ నియోజకవర్గంలో SIR కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హుగ్గెల్లి రాములు, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్షద్ అలీ, సామేల్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, మాజీ వైస్ చైర్మన్ ఖాజా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్ మహేష్ కుమార్, నాయకులు, కార్యకర్తలు, BLAలు పాల్గొన్నారు.



# బిజిలిపూర్‌లో ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావుకు ఘన సన్మానం

మెదక్, జూలై 24: వట్‌పల్లి మండలంలోని బిజిలిపూర్ గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (SIR) కార్యక్రమంలో భాగంగా ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావును గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆరుగొండ సంగప్ప ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాచూర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# జోగిపేట ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం కార్యదర్శిగా జుట్టు పెద్ద నర్సింలు ఎన్నిక

మెదక్, జూలై 24: జోగిపేట ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యదర్శిగా మరవెల్లి గ్రామానికి చెందిన జుట్టు పెద్ద నర్సింలు ఎన్నిక కావడంతో పలువురు నాయకులు, సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సందేశం టైమ్స్ వట్‌పల్లి మండల ప్రతినిధి సీహెచ్ బస్వరాజ్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం మరింత అభివృద్ధి సాధిస్తూ సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కార్యదర్శి జుట్టు పెద్ద నర్సింలు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి, సభ్యుల ప్రయోజనాల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలు జరిగాయి.. విచారణ జరిపి న్యాయం చేయాలి: దగ్గుబాటి సామ్రాజ్యం




సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్, జూలై 24: చింతకాని మండలం వందనం గ్రామంలో జరిగిన ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో తనకు అన్యాయం జరిగిందని గ్రామానికి చెందిన దగ్గుబాటి సామ్రాజ్యం ఆరోపించారు. అర్హతలు ఉన్నప్పటికీ తనను పక్కనపెట్టి తక్కువ అర్హతలు కలిగిన వారికి ఉద్యోగాలు కేటాయించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, ఇంటర్వ్యూ పేరుతో అభ్యర్థులను రోజుల తరబడి వేచి ఉండేలా చేసి చివరకు నిబంధనలకు అనుగుణంగా ఇంటర్వ్యూలు నిర్వహించలేదని ఆరోపించారు. కేవలం కొద్ది సమయంలోనే ఇంటర్వ్యూలు పూర్తి చేసి అభ్యర్థుల విద్యార్హతలు, అనుభవాలను సరిగా పరిశీలించకుండా ఎంపికలు చేశారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ కనీస అర్హతగా ఉన్నప్పటికీ, అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను పక్కనపెట్టి స్థానిక నాయకులకు అనుకూలమైన వారికి ఉద్యోగాలు ఇచ్చారనే అనుమానం ఉందన్నారు. ఈ నియామకాల్లో డబ్బులు చేతులు మారాయనే అనుమానాలు ఉన్నాయని, అందువల్ల ఉన్నతాధికారులు వెంటనే స్పందించి దరఖాస్తుల పరిశీలన, అభ్యర్థుల అర్హతలు, ఇంటర్వ్యూ విధానం, ఎంపిక జాబితా తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. విచారణలో అక్రమాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని దగ్గుబాటి సామ్రాజ్యం డిమాండ్ చేశారు.

# వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాల తరలింపు పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్, జూలై 24: ఖమ్మం జిల్లా వెంకటాయపాలెం సమీపంలోని నాగార్జునసాగర్ (ఎన్ఎస్పీ) ప్రధాన కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు వేగంగా చేరుతున్న గోదావరి జలాల తరలింపు ప్రక్రియను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజా ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యల పురోగతిని ఆయన సమీక్షించారు. భద్రాచలం సమీపంలోని దుమ్ముగూడెం నుంచి సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా రాజీవ్ లింక్ కాలువకు మళ్లించిన గోదావరి జలాలను ఎన్ఎస్పీ కాలువ మార్గంలో వైరా జలాశయానికి తరలిస్తున్న విధానాన్ని ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను పెంచేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన అన్ని చర్యలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# సింగరేణిని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## ప్రైవేటు పోటీని ఎదుర్కొనేలా నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, వ్యయ నియంత్రణపై దృష్టి పెట్టాలి: డిప్యూటీ సీఎం





సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్ / సత్తుపల్లి జూలై 24: తెలంగాణ గుండెచప్పుడుగా నిలిచిన సింగరేణి సంస్థను పోటీ ప్రపంచంలో సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యాపార విస్తరణతో భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, బొగ్గు లభ్యత, నాణ్యత, ఉత్పత్తి విధానాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి తెలంగాణ ప్రజలతో 130 ఏళ్ల చరిత్ర కలిగిన భావోద్వేగ బంధమని, ఈ ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థల నుంచి పెరుగుతున్న పోటీని ఎదుర్కొనేలా సింగరేణి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంతో పాటు అత్యుత్తమ నాణ్యత కలిగిన బొగ్గును ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గులో ఓవర్ బర్డెన్ మట్టి, రాళ్లు కలవకుండా ప్రతి లోడింగ్ పాయింట్ వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత లేని బొగ్గు సరఫరా వల్ల రవాణా ఖర్చులు పెరగడంతో పాటు విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని, జెన్‌కోతో పాటు ఇతర వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును మాత్రమే అందించాలని సూచించారు. గత పదేళ్లలో కొత్త కోల్ బ్లాకుల విషయంలో అవకాశాలు కోల్పోయామని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కనీసం పదేళ్ల ముందస్తు ప్రణాళికతో సింగరేణి ముందుకు సాగాలని తెలిపారు. రాబోయే రోజుల్లో కొత్త కోల్ బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. బొగ్గు ఉత్పత్తితో పాటు సోలార్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్, హైడ్రోజన్, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి భవిష్యత్ రంగాల్లోకి కూడా సింగరేణి విస్తరించాలని సూచించారు. ప్రపంచ స్థాయిలో సింగరేణిని నిలబెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం కిష్టారం ప్రాంతంలో నిర్మించిన సింగరేణి క్వార్టర్లను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్‌కో సీఎండీ హరీష్, సింగరేణి డైరెక్టర్లు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి, జహీరాబాద్ అభివృద్ధికి కేంద్ర సహకారం కోరిన ఎమ్మెల్యేలు

సంగారెడ్డి/జూలై 24 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్): సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరుతూ పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్రతో కలిసి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఢిల్లీలో కేంద్ర రైల్వే, సమాచార ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్ & ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. సంగారెడ్డి అభివృద్ధిలో భాగంగా ప్రతిపాదిత ముంబై–హైదరాబాద్ హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో సంగారెడ్డిలో స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. హైదరాబాద్‌కు సమీప జిల్లా కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డిలో ఐఐటీ హైదరాబాద్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఔషధ పరిశ్రమలు, జాతీయ రహదారులు, రీజినల్ రింగ్ రోడ్ వంటి కీలక సదుపాయాలు ఉన్నాయని వివరించారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మాణిక్‌రావు జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే రేక్ పాయింట్ ఏర్పాటు చేయాలని, అలాగే ముంబై–హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో జహీరాబాద్ స్టేషన్‌ను చేర్చి స్టాప్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్‌లో 12,656 ఎకరాల్లో నిమ్జ్, ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులు కొనసాగుతున్న నేపథ్యంలో వేగవంతమైన రవాణా సదుపాయాలు అవసరమని తెలిపారు. వినతిపత్రాలను పరిశీలించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యేలు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నూతలపాటి దంపతుల దాతృత్వం,200 గజాల స్థలం ఉచితంగా అందజేత

# వెలుగు కార్యాలయ నిర్మాణానికి రూ.25 లక్షల విలువైన స్థలం దానం చేసిన నూతలపాటి దంపతులు

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్ / చింతకాని, జూలై 24: చింతకాని మండలం అనంతసాగర్ గ్రామంలో వెలుగు కార్యాలయ నిర్మాణం కోసం నూతలపాటి దంపతులు గొప్ప దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో గ్రామం మధ్యలో రామాలయం పక్కన ఉన్న సుమారు 200 గజాల స్థలాన్ని స్వర్గీయ నూతలపాటి నందమయ్య, లక్ష్మీబాయమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు మాజీ సర్పంచ్ నూతలపాటి మంగతాయమ్మ–వెంకటేశ్వరరావు దంపతులు అందజేశారు. ఈ స్థలం విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ జడ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, చింతకాని ఎంపీడీవో శ్రీనివాసరావు సమక్షంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి స్థలాన్ని అనురాధ, పుల్లారావులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు నూతలపాటి వెంకటేశ్వరావును శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా నూతలపాటి వెంకటేశ్వరావును గ్రామస్తులు కొనియాడుతూ ఈ సేవా కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కటియాల రామయ్య, మాజీ సర్పంచ్ చల్ల అచ్చయ్య, జానపాటి ఆదినారాయణ, జడ సుధాకర్, తన్నీరు రవి, తన్నీరు కృష్ణయ్య, సీతయ్య, పుల్లారావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# SIR ప్రక్రియలో మాద్రి పృథ్వీరాజ్ సేవలు అభినందనీయం



సంగారెడ్డి/జూలై 24 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును ప్రతి అర్హుడికి అందించాలనే లక్ష్యంతో జరుగుతున్న SIR (Special Intensive Revision) ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పటాన్‌చెరు పట్టణంలో మాద్రి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు కొనసాగుతున్నాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచనల మేరకు సుమారు 30 మంది బీటెక్ విద్యార్థులను స్వంత ఖర్చులతో వాలంటీర్లుగా నియమించి, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఈ వాలంటీర్లు BLOలకు సహకరిస్తూ ఇంటింటి ఎన్యూమరేషన్ ప్రక్రియలో పాల్గొని SIR ఫారాలు నింపడం, పత్రాల పరిశీలన, ప్రజలకు అవగాహన కల్పించడం, పూర్తి చేసిన దరఖాస్తులను ECI యాప్‌లో నమోదు చేయడం వంటి సేవలను అందిస్తున్నారు. అలాగే MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో SIR హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హ ఓటర్లకు ప్రత్యేక సహాయం అందిస్తున్నారు. ప్రతి అర్హ ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలనే లక్ష్యంతో, ఏ ఒక్క ఓటు కూడా వృథా కాకుండా చూడటమే తమ ఉద్దేశమని మాద్రి పృథ్వీరాజ్ తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణకు ప్రజలకు అవసరమైన సహకారం అందించేందుకు MDR ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు.

# నీట్ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది: ఎంపీ రఘునందన్ రావు



మెదక్ / జూలై 24 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్): నీట్ (NEET) పరీక్షలో జరిగిన అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (CBI) విచారణ కొనసాగుతోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, నీట్ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఈ అంశంపై చర్చకు రావాలని కోరినా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముందుకు రావడం లేదని ఆరోపించారు. నీట్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి ఇప్పటివరకు 17 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టిన వారిలో నిజంగా నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు ఎంతమంది ఉన్నారో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. నీట్ వ్యవహారంలో వాస్తవాలు సీబీఐ దర్యాప్తు ద్వారా వెలుగులోకి వస్తాయని, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తోందని ఎంపీ



## SIR ఎన్యూమరేషన్‌లో వేగవంతమైన సేవలు అందించిన వీరేశంకు ఘన సన్మానం

అందోల్ / జూలై 24 (సందేశం టైమ్స్ అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు): వట్‌పల్లి మండలం కేరూర్ గ్రామంలో SIR (Special Intensive Revision) ఎన్యూమరేషన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల వివరాలను వేగంగా ఆన్‌లైన్ చేసిన బర్గ్ వీరేశంను పెద్దపట్ల వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఉన్న ఓటర్ల వివరాలను సేకరించి, ఓటర్ ఐడీ ఫారాలను ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు చేయడంలో వీరేశం కీలక పాత్ర పోషించారు. సర్పంచ్ కార్తీక్ గౌడ్, ఉపసర్పంచ్ రాములు, వార్డు సభ్యులు శిన్నెల పాపయ్య, నాలుగో వార్డు సభ్యురాలు బర్గ్ మంజుల BLOల సహకారంతో గ్రామంలో SIR ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓటర్ల ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేసినందుకు బర్గ్ వీరేశంను అభినందిస్తూ సన్మానం చేశారు. కార్యక్రమంలో చెన్న గౌడ్, చెన్నెలి పాపారాయుడు, బర్గ్ అడివయ్య, సుధాకర్, ఊషయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం – నీటి వనరుల పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో పంటల పరిస్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, తాగునీరు, సాగునీటి సరఫరా అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని నీటి వనరుల లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశించారు. సాగు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన సహకారం అందించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



## గొల్లప్రోలు పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా దివిజ సంపతి బాధ్యతల స్వీకరణ

గొల్లప్రోలు, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): గొల్లప్రోలు పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా శ్రీమతి దివిజ సంపతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పురపాలక కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది నూతన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో గతంలో కమిషనర్‌గా విధులు నిర్వహించిన శ్రీ పి. శ్రీనివాసులు, మేనేజర్ సర్వేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎండి ఆలీషా, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీమతి జే.ఎన్.సీహెచ్ నీలిమ దీప్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని అధికారులు తెలిపారు.

## ఏపీకి భారీ జాతీయ రహదారి ప్రాజెక్టు – ముదిగుబ్బ-కదిరి NH-42 విస్తరణకు రూ.679.71 కోట్లు మంజూరు

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం భారీ జాతీయ రహదారి ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. శ్రీ సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ-కదిరి జాతీయ రహదారి (NH-42) విస్తరణ పనులకు రూ.679.71 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ఉన్న రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు బెంగళూరు–విజయవాడ–కోల్‌కతా ఎక్స్‌ప్రెస్‌వే, తిరుపతి, చెన్నై ప్రాంతాలతో రవాణా అనుసంధానం మరింత మెరుగుపడనుంది. ప్రాజెక్టులో భాగంగా సర్వీస్ రోడ్లు, ఒక ఫ్లైఓవర్, ఒక వాహన అండర్ పాస్ కమ్ రోడ్ ఓవర్ బ్రిడ్జి (VUP-cum-ROB), ఒక ప్రధాన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రహదారి అభివృద్ధితో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఊతం లభించనుందని అధికారులు తెలిపారు.




## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష – ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్) : రాష్ట్రంలో ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై మంత్రుల బృందం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు అందించారు. కార్యక్రమ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యం, వివిధ శాఖల సమన్వయం వంటి అంశాలపై మంత్రుల బృందం చర్చించి అధికారులకు పలు సూచనలు చేసింది. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని, ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొని కార్యక్రమ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.



## శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తప్పనిసరి – పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచన

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కొన్ని రాజకీయ పార్టీలు హద్దులు దాటుతున్నాయని, వారిని ఎప్పటికప్పుడు నియంత్రించకపోతే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అదుపులోకి రాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో తమ పార్టీకి చెందిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకున్నామని, ఫ్యాక్షనిజం వంటి సమస్యలను నియంత్రించడంలో కఠిన వైఖరి ఫలితాన్నిచ్చిందని సీఎం తెలిపారు. సోషల్ మీడియాను వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసేలా, క్యారెక్టర్ అసాసినేషన్ కోసం వినియోగించడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. పోలీసు శాఖలో అనేక విభాగాలు, వివిధ స్థాయిల్లో అధికారులు ఉన్నారని, ప్రతి అధికారి తమ కింది స్థాయి సిబ్బందికి సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించి సమర్థవంతంగా పనిచేయించేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సరైన వ్యూహాలను రూపొందించుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.



## రాజమండ్రి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం – రంపచోడవరం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు హాజరు

రాజమండ్రి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయంలో మంత్రి లోకేష్ వివిధ సమస్యలపై కార్యకర్తలు, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు మార్గంలో పోలవరం జిల్లా రంపచోడవరం బయలుదేరారు. రేపు రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. విద్యా రంగ అభివృద్ధి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం.

# నేతన్న సేవ పథకానికి ఏపీ కేబినెట్ ఆమోదం – చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'నేతన్న సేవ' పథకానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నేతన్నలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందించే ఈ పథకాన్ని ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు రూ.4 వేల పెన్షన్, ఉచిత విద్యుత్ పథకాలు కొనసాగుతున్నాయని మంత్రి సవిత తెలిపారు. చేనేత కుటుంబాలకు ప్రభుత్వం అందించే వివిధ పథకాల ద్వారా ఏడాదికి రూ.81,640 నుంచి రూ.94,600 వరకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఆమె వివరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో చేనేత రంగానికి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని, చేనేత రంగానికి స్వర్ణయుగం ప్రారంభమైందని మంత్రి సవిత పేర్కొన్నారు. చేనేత రంగంపై ప్రతిపక్షాల ఆరోపణలను ఆమె ఖండించారు.





# ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం – మాఫియా మూలాలను నిర్మూలించాలి: పవన్ కళ్యాణ్

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎర్రచందనం స్మగ్లింగ్‌పై జీరో టాలరెన్స్ విధానంతో కఠిన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం మాఫియా మూలాలను పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్మగ్లర్లతో పాటు వారి వెనుక ఉన్న కింగ్‌పిన్లు, ఆర్థిక సహకారం అందించే వ్యక్తులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అడవుల్లో అక్రమ రవాణాను అరికట్టేందుకు డ్రోన్లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి 506 కేసులు నమోదు చేసి, 1,239 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. దేశంలోని ఎక్కడ ఉన్నా ఎర్రచందనం అక్రమ నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, ఇతర రాష్ట్రాలతో సమన్వయం పెంచుకుని స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను పూర్తిగా అడ్డుకోవాలని ఆయన ఆదేశించారు.

# సీదిరి అప్పలరాజుపై రిమాండ్ రిపోర్టులో పోలీసుల ఆరోపణలు – సాక్ష్యాల తారుమారు కుట్ర జరిగిందని వెల్లడి

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో పోలీసులు రిమాండ్ రిపోర్టులో పలు సంచలన ఆరోపణలు చేసినట్లు వెల్లడించారు. ఆయన కుమారుడు చేసినట్లు ఆరోపిస్తున్న ప్రమాద ఘటనలో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు కుట్ర జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. ప్రమాదానికి సంబంధించిన వ్యక్తికి ఆశ్రయం కల్పించినట్లు, నిందితుడిని మార్చే ప్రయత్నం జరిగినట్లు దర్యాప్తులో తేలిందని రిమాండ్ రిపోర్టులో వివరించారు. పెట్రోల్ బంక్ సిబ్బంది, వైద్యులు సీదిరి కుమారుడిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్లు కూడా రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. సీదిరి అప్పలరాజుపై 11 కేసులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# బియ్యం ధరల నియంత్రణకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం – ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే విక్రయాలు

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం ధరల నియంత్రణపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రైతు బజార్లు, ప్రభుత్వ విక్రయ కేంద్రాల ద్వారా తక్కువ ధరలకు బియ్యం విక్రయించాలని నిర్ణయించారు. బీపీటీ, కేఎన్ఎం స్టీమ్ రైస్‌ను కిలో రూ.52కు, పచ్చి బియ్యం (రా రైస్)ను కిలో రూ.50కు విక్రయించేలా చర్యలు చేపట్టనున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని రైస్ మిల్లర్లు హామీ ఇచ్చారు. సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# నీట్ ఆందోళనలకు పవన్ కళ్యాణ్ స్పందన – ప్రజాస్వామ్య నిరసనకు మద్దతు, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకం

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నీట్ పరీక్షకు సంబంధించిన ఆందోళనలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే నిరసనలకు తన మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. అయితే కొందరు విభజన శక్తులు విద్యార్థుల ఆందోళనను పక్కదారి పట్టించి, హైజాక్ చేశాయని ఆరోపించారు. శాంతియుత నిరసనలను హింసాత్మకంగా మార్చే ప్రయత్నాలను అంగీకరించబోమని తెలిపారు. దేశ వ్యతిరేక నినాదాలకు, కార్యకలాపాలకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ 'నేషన్ ఫస్ట్' భావనతో ముందుకు సాగాలని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని తెలిపారు.



# బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను కలిసిన జనసేన ఎంపీలు – రాష్ట్ర అభివృద్ధి అంశాలపై చర్చ

న్యూఢిల్లీ, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బి.ఎల్. సంతోష్‌ను జనసేన పార్టీ పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేష్, పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టాల్సిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు, ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించే దిశగా తీసుకోవాల్సిన నిర్ణయాలపై నేతలు అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న నటుడు రమేష్ కుటుంబానికి పవన్ కళ్యాణ్ భరోసా – వైద్య సహాయంపై అధికారులకు ఆదేశాలు



అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న గబ్బర్ సింగ్ ఫేమ్ నటుడు రమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. రమేష్ కుటుంబ సభ్యులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడిన పవన్ కళ్యాణ్, వారికి ధైర్యం చెబుతూ "ధైర్యంగా ఉండండి... మీ కుటుంబానికి అండగా నేనున్నాను" అని భరోసా ఇచ్చారు. రమేష్‌కు అవసరమైన వైద్య సహాయం ఎలాంటి ఆలస్యం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులను ఆదేశించారు. అలాగే ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నటుడు రమేష్ త్వరగా కోలుకోవాలని అభిమానులు, సినీ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి.



# ఉండవల్లి గుహల్లో తెలుగు మహోత్సవానికి సర్వం సిద్ధం – జూలై 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయి వేడుకలు

అమరావతి, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, జానపద కళల వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో ఉండవల్లి గుహల వద్ద నిర్వహించనున్న 'తెలుగు మహోత్సవం'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జూలై 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరగనున్న ఈ సాంస్కృతిక వేడుకల అధికారిక పోస్టర్‌ను మంత్రి కందుల దుర్గేష్, సాంస్కృతిక సృజనాత్మక సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని ఆవిష్కరించారు. తెలుగు భాషా గౌరవాన్ని మరింత పెంచేలా, భాషా పరిరక్షణ, సాహిత్య వికాసం, సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించే విధంగా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మాతృభాష పరిరక్షణలో యువత ముందుండాలని, ప్రతి తెలుగు భాషాభిమాని ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయి సాంస్కృతిక వేడుకగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవం తెలుగు సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించనుందని అధికారులు తెలిపారు.

# పాలకొల్లులో క్రోచెట్ లేస్ కళాకారులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం – 217 మందికి కంటి పరీక్షలు



పాలకొల్లు, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవంలో ఇచ్చిన హామీ మేరకు గురువారం పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని యలమంచిలిలో క్రోచెట్ లేస్ కళాకారుల కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 217 మంది కళాకారులకు కంటి పరీక్షలు నిర్వహించగా, ఐదుగురిలో శుక్లాల సమస్యను గుర్తించారు. 187 మందికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత వారం నరసాపురంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కంటి చూపు సమస్యలు ఉన్న 142 మంది హస్తకళాకారులకు కూడా కళ్లద్దాలు అందించే ఏర్పాట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్నారు. హస్తకళాకారుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు.




## నీట్ 2024 లీక్ కేసులో సంజీవ్ ముఖియాకు సీబీఐ క్లీన్ చిట్ – ప్రమేయానికి ఆధారాలు లేవని వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నీట్ 2024 ప్రశ్నపత్రం లీక్ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్న సంజీవ్ ముఖియాకు సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో సంజీవ్ ముఖియా ప్రమేయం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని సీబీఐ స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వకంగా నిందితుడిని కేసు నుంచి తప్పించారన్న ఆరోపణలను కూడా దర్యాప్తు సంస్థ ఖండించింది. నీట్ 2024 లీక్ ఆరోపణల నేపథ్యంలో బీహార్ పోలీసులు సంజీవ్ ముఖియాపై కేసు నమోదు చేశారు. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేపట్టింది. దర్యాప్తులో లభించిన ఆధారాల ఆధారంగానే చర్యలు తీసుకున్నామని సీబీఐ అధికారులు తెలిపారు.



## అమ్మవారి ఒడిలో ఆర్య జన్మదిన వేడుకలు: ప్రత్యేక పూజలు నిర్వహించిన కవిత దంపతులు

జూబ్లీ హిల్స్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 24: తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత, దేవనపల్లి అనిల్ దంపతులు తమ చిన్న కుమారుడు ఆర్య జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జూబ్లీహిల్స్ లోని ప్రసిద్ధ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన కవిత దంపతులకు, కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తమ కుమారుడు ఆర్యతో కలిసి కవిత దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ చైర్మన్ పి. విష్ణు వర్ధన్ రెడ్డి కవిత దంపతులను, వారి కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించి అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ వేడుకలో వారి కుటుంబ సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొని చిరంజీవి ఆర్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## జర్నలిస్టుల బస్ పాస్‌ల గడువు ఆగస్టు 3 వరకు పెంపు: ఐ&పిఆర్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు


GOVERNMENT OF TELANGANA
INFORMATION AND PUBLIC RELATIONS DEPARTMENT::
HYDERABAD

From,
The Spl. Commissioner,
Information & Public Relations Dept.,
A.C. Guards, Hyderabad.

To,
The Managing Director,
TGSRTC,
Hyderabad.

**Letter No. 001218/MR/2026, date: 23.07.2026.**

Sir,

Sub:- I&PR Dept., - Media Relations Section - Issue of State and District Journalists bus passes - Reg.
Ref:- 1. This office letter no. 001218/MR/2026, dt. 10.06.2026, 01.07.2026.
2. This office letter no. 003491/MR/2024, dt. 30.04.2026 & dt. 29.05.2026.
***

I am to inform that the accreditation cards for the years 2026-2028 are issued to the working journalists at state and district level. The issuing of further cards is still in process. However the old accreditation cards (2024-2026) validity is further extended upto 03.08.2026.

Hence you are requested to extend the validity period of all the old state and district journalists bus passes for (12) days i.e., from 23.07.2026 upto 03.08.2026 without insisting for validity period on the accreditation cards.

Yours Faithfully
Sd/- Dr. G. Mukunda Reddy
Spl. Commissioner

Copy to
The Chairman, Media Academy of Telangana State.
The Regional Joint Director, Multi Zone-I & Multi Zone-II.
All the DPRO's in the State for information and necessary action.

//f.b.o//

Addl. Director (PAC)

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 24: వర్కింగ్ జర్నలిస్టులకు తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ బిగ్ రిలీఫ్ ఇచ్చింది. రాష్ట్ర మరియు జిల్లా స్థాయి విలేకరులకు సంబంధించిన పాత అక్రిడిటేషన్ కార్డుల (2024-2026) కాలపరిమితిని, అలాగే వాటి ఆధారంగా పొందిన ఆర్టీసీ బస్ పాస్‌ల చెల్లుబాటు గడువును ఈ నెల 23 నుండి వచ్చే ఆగస్టు 3వ తేదీ వరకు (12 రోజులు) పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ జి. ముకుందరెడ్డి, టీజీఎస్ఆర్టీసీ (TGSRTC) మేనేజింగ్ డైరెక్టర్‌కు అధికారిక లేఖ రాశారు. 2026-2028 సంవత్సరాలకు సంబంధించి కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతున్నందున, విలేకరులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పాత అక్రిడిటేషన్ కార్డులు మరియు బస్ పాస్‌ల గడువును సవరించినట్లు అందులో స్పష్టం చేశారు. పాత కార్డులపై వ్యాలిడిటీ సమయం అయిపోయినప్పటికీ ఆగస్టు 3 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతించాలని ఐ&పిఆర్ డిపార్ట్‌మెంట్ ఆర్టీసీ యాజమాన్యాన్ని కోరింది. ఈ సమాచారాన్ని తెలంగాణ స్టేట్ మీడియా అకాడమీ చైర్మన్‌తో పాటు రాష్ట్రంలోని రీజినల్ జాయింట్ డైరెక్టర్లు మరియు

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అక్రిడేషన్ ఐడీ కార్డులకు విలువ లేదన్న పోలీసులు: బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద తీవ్ర వివాదం



బల్కంపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 24: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు మీడియా ప్రతినిధుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా, దురహంకారంతో వ్యవహరించిన తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ, ఇతర పరిస్థితులపై వార్తా సేకరణ కోసం వెళ్లిన విలేకరులను పోలీసులు దర్శనానికి అనుమతించకుండా అడ్డుకోవడమే కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా జారీ చేసిన జర్నలిస్ట్ అక్రిడిటేషన్ ఐడీ కార్డులను చూపించగా "ఈ కార్డులకు ఇక్కడ ఏమీ విలువ లేదు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన అక్రిడిటేషన్ కార్డులకే రక్షణ, విలువ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న పాత్రికేయుల పట్ల పోలీసులు ఈ విధంగా వ్యవహరించడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులతో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిన సదరు పోలీసులపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, మీడియా ప్రతినిధుల విధులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం జారీ చేసిన అక్రిడిటేషన్ ఐడీ కార్డుల గౌరవాన్ని కాపాడాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే పాత్రికేయ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## బల్కంపేట ఘటనపై సీరియస్: పాత్రికేయుల పట్ల దురహంకార వైఖరి నశించాలి – తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ హెచ్చరిక

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 24: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద వార్తా సేకరణ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధుల పట్ల అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు అత్యంత నిర్లక్ష్యంగా, దురహంకారంతో వ్యవహరించడాన్ని తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారికంగా జారీ చేసిన జర్నలిస్ట్ అక్రిడిటేషన్ ఐడీ కార్డులను చూపించినప్పటికీ, "ఈ కార్డులకు ఇక్కడ ఏమీ విలువ లేదు" అంటూ మాట్లాడటం ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన గుర్తింపు కార్డులకే రక్షణ, గౌరవం లేకపోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన విధుల్లో ఉంటూ జర్నలిస్టులతో అసభ్యంగా, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిన సదరు పోలీసు అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని శెట్టి వెంకటేష్ డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించుకునే వాతావరణాన్ని కల్పించాలని, అక్రిడిటేషన్ కార్డుల గౌరవాన్ని కాపాడాలని పేర్కొన్నారు. సదరు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోని పక్షంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాత్రికేయులను ఏకతాటిపైకి తెచ్చి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని శెట్టి వెంకటేష్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.

## డీజీపీ కార్యాలయంలో విషాదం: సర్వీస్ తుపాకీతో కానిస్టేబుల్ ఆత్మహత్య



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 24: రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. డీజీపీ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ స్వామి తన వద్ద ఉన్న సర్వీస్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. అధికారుల సమాచారం ప్రకారం, తెల్లవారుజామున సుమారు 5:30 గంటల సమయంలో డీజీపీ కార్యాలయంలోని వాష్‌రూమ్‌లోకి వెళ్లిన స్వామి తన తుపాకీతో కాల్పులు జరుపుకుని ప్రాణాలు విడిచినట్లు తెలిసింది. ఘటనా స్థలంలో ఒక సూసైడ్ నోట్ లభ్యమైనట్లు సమాచారం వెలువడింది. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని, కానిస్టేబుల్ ఆత్మహత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు ప్రారంభించారు. సూసైడ్ నోట్‌లోని అంశాలను కూడా అధికారులు తీవ్రంగా పరిశీలిస్తున్నారు.

## విద్యార్థులపై దాడులకు నిరసనగా జన్మదిన వేడుకలకు దూరంగా కేటీఆర్: రేపు ఇందిరా పార్క్ వద్ద నిరసన ప్రదర్శన




హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 24: దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన అణచివేత, దాడుల నేపథ్యంలో తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్ణయించుకున్నారు. ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన పోరాటానికి పూర్తి సంఘీభావం తెలుపుతూ, వారిపై కేంద్ర ప్రభుత్వ దాడులను నిరసిస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (BRSV) ఆధ్వర్యంలో జూలై 24న ఉదయం 10:00 గంటలకు ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే భారీ నిరసన కార్యక్రమంలో ఆయన నేరుగా పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులపై జరుగుతున్న దాడులతో పాటు, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవక రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందుల వల్ల నెలకొన్న గంభీరమైన పరిస్థితుల దృష్ట్యా తన 50వ జన్మదినాన్ని జరుపుకోకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షల పేరుతో కేక్ కటింగ్‌లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, పూల బొకేలు మరియు పత్రికా ప్రకటనలపై అనవసరంగా డబ్బు ఖర్చు చేయవద్దని పార్టీ శ్రేణులు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఆ నిధులను ఆపదలో ఉన్నవారికి, అవసరంలో ఉన్నవారికి సాయం అందించే సేవా కార్యక్రమాలకు వినియోగించి తన జన్మదినాన్ని అర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.